చెత్త బండి.. మొరాయించిందండి!

- మార్కాపురం మున్సిపాలిటీలో మూలకు చేరిన ఈ-ఆటోలు
- రోజూ చెత్త సేకరణలో కార్మికులకు ఇబ్బందులు
- 21 ఆటోల్లో పనిచేస్తున్నది 8 మాత్రమే..
- విడిభాగాలు తెప్పించడంలో జాప్యమే కారణం

మార్కాపురం పట్టణంలో వార్డులు **35**

మొత్తం జనాభా **1,00,000** (సుమారుగా)

పారిశుధ్య సిబ్బంది **205** మంది

రోజూ సేకరించే చెత్త **34** టన్నులు



మున్సిపాలిటీ కార్యాలయంలో ఓ మూలకుచేరిన ఈ-ఆటోలు

మార్కాపురం: వీధుల్లో చెత్త సేకరించేందుకు మార్కాపురం మున్సిపాలిటీకి కేటాయించిన ఈ-ఆటోలు మూలకు చేరి నిరుపయోగంగా మారాయి. డివిజన్ కేంద్రమైన మార్కాపురం మున్సిపాలిటీలో 35 వార్డులు ఉండగా సుమారు లక్ష మంది జనాభా నివసిస్తున్నారు. పట్టణంలో రోజూ గృహాలు, వ్యాపార సముదాయాల నుంచి 34 టన్నుల చెత్త పోగుపడుతోంది. చెత్త సేకరింపులో జాప్యాన్ని నివారించేందుకుగాను 2022లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మార్కాపురం మున్సిపాలిటీకి 21 ఈ-ఆటోలు మంజూరు చేసింది. వీటిలో 16 ఈ-ఆటోలు మరమ్మతులకు గురికావడంతో కొన్ని నెలలుగా నిరుపయోగంగా మారాయి. ఈ క్రమంలో 3 ఆటోలను రిపేర్ చేయించారు. ప్రస్తుతం 8 ఆటోలను మాత్రమే చెత్త సేకరణకు వినియోగిస్తుండగా మరో 13 ఆటోలు మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఓ మూలనపెట్టారు.

కార్మికులకు తప్పని కష్టం

మార్కాపురం పట్టణంలో 205 మంది పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు కేవలం 8 ఆటోలు, 3 మినీ లారీలు మాత్రమే ఉన్నాయి. పూర్తి స్థాయిలో వాహనాలు లేకపోవడంతో పనిభారం ఎక్కువైందని పారిశుధ్య సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. చెత్త తొలగింపు ఆలస్యం అవుతుండటంతో పలు ప్రాంతాల్లో ప్రజలు ముక్కుమూసుకుని నడవాల్సి వస్తోంది. ఆటోలకు వేగంగా మరమ్మతులు చేయిస్తే చెత్త సేకరణ సులువవుతుందని కార్మికులు చెబుతున్నారు.

అందుబాటులోకి తెస్తాం

తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత 3 ఈ-ఆటోలను బాగుచేయించా. వీటి స్పేర్‌పార్టులు గుంటూరు నుంచి తీసుకురావాల్సి ఉంది. ఈ నెల 20వ తేదీ నాటికి మొత్తం ఈ-ఆటోలను బాగుచేయించి అందుబాటులోకి తెస్తాం. పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించకుండా పనిచేస్తున్నా రు. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే మా దృష్టికి తేవాలి. – డీవీఎస్ నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

క్లుప్తంగా

గ్రహణమొర్రికి ఉచిత శస్త్ర చికిత్స


చికిత్సకు వచ్చిన చిన్నారులతో వైద్య సిబ్బంది

మార్కాపురం: గ్రహణమొర్రికి ఉచిత శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్(ఆర్‌బీఎస్‌కే)ప్రతినిధులు తెలిపారు. గురువారం స్థానిక జీజీహెచ్‌లో పిన్నమనేని సిద్దార్థ కాలేజీ, స్మైల్ టైమ్ ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు, డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రహణమొర్రి గల పిల్లలు 13 మందిని పరిశీలించారు. బాధిత చిన్నారులు జీజీహెచ్‌లో సంప్రదించి ఉచిత సేవలు పొందవచ్చని దంత వైద్యుడు డాక్టర్ శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీఓ కార్యాలయానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

మార్కాపురం: మార్కాపురం పీఆర్ అతిథి గృహం వద్ద డీఎల్‌డీఓ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జెడ్పీ సీఈఓ చిరంజీవి గురువారం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం డీఎల్‌డీఓ కార్యాలయం ఎంపీడీఓ ఆఫీసులో ఒక గదిని కేటాయించారు. శాశ్వతంగా భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి స్థల పరిశీలన చేసినట్లు సీఈఓ తెలిపారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ మోహన్‌రాజు, డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

రక్తదానంలో హాఫ్ సెంచరీ!


రక్తదానం చేస్తున్న అశోక్‌రెడ్డి

కొమరోలు: రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆపదలో ఉన్నవారికి స్వయంగా రక్తదానం చేస్తూ మన్ననలు అందుకుంటున్నాడు కొమరోలు మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన చల్లా అశోక్‌రెడ్డి. గత 13 ఏళ్లుగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ యువతను ప్రోత్సహిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో వైద్యశాలలో ఓ మహిళకు అత్యవసరంగా గుండె ఆపరేషన్‌కు రక్తం అవసరం కాగా మేమున్నాం సేవా సమితి ఆధ్వర్యంలో చల్లా అశోక్‌రెడ్డి 50వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డిని పలువురు అభినందించారు.

ఆటో, కారు ఢీ.. ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

మార్కాపురం టౌన్: మార్కాపురం చెరువుకట్టపై గురువారం వేకుమజామున ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణ పోలీసుల కథనం మేరకు.. మార్కాపురం నుంచి రైల్వేస్టేషన్‌కు ఆటో వెళ్తుండగా, అదే సమయంలో ఒంగోలు నుంచి మార్కాపురం వైపు వస్తున్న కారు చెరువు కట్ట వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ పానకాల సాయి, దొంతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి, వెంకటరావమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ పోలీసులు తెలిపారు.

జర్నలిస్టులపై రెడ్‌బుక్ రాజ్యాంగమా?

- సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం జర్నలిస్టులపై రెడ్ బుక్ రాజ్యాంగం అమలు పరచడం సిగ్గుచేటని సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై తన కలం ఝుళిపిస్తున్నారన్న భయంతో సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి ఇంటిపైకి పోలీసులను పంపించి తనిఖీలు చేయించడం, గంటకుపైగా ఆయన నివశిస్తున్న అపార్టుమెంటులో భయానక వాతావరణం సృష్టించడం అన్యాయమన్నారు. అన్ని రంగుల పుస్తకాలు వడపోసిన జర్నలిస్టులు రెడ్ బుక్‌కు భయపడతారని ప్రభుత్వం భావించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పారిశుధ్యం, తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

- మార్కాపురం నూతన డీఎల్‌పీఓ భాస్కర్‌రెడ్డి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎల్‌పీఓ భాస్కర్‌రెడ్డి

తర్లుపాడు: మార్కాపురం డివిజన్‌లో పారిశుధ్యం, తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని డివిజన్ పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన డీఎల్‌పీఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని చెప్పారు. పల్నాడు నుంచి బదిలీపై మార్కాపురంలో నియమితులైన డీఎల్‌పీఓను పలువురు ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి

- రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి


మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

మార్కాపురం: రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సావిత్రి తెలిపారు. గురువారం ఆమె మార్కాపురం పట్టణంలోని పీఆర్ అతిథి గృహంలో రజక వృత్తిదారులు, ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి జిల్లాలో ఒక మోడల్ దోబీ ఘాట్ నిర్మిస్తామని చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు భవనాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో దోబీ పనులను రజకులకు మాత్రమే అప్పగించాలన్నారు. రజక వృత్తిదారులకు కార్మికశాఖ ద్వారా గుర్తింపు కార్డుతోపాటు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆమెను రజక సంఘ నాయకులు కనిగిరి బాలవెంకటరమణ, పేరూరి వెంకటేశ్వర్లు, టి.సుబ్రహ్మణ్యం, పి.నారాయణ, దేవలూటి శంకర్ తదితరులు సన్మానించారు.

11 నుంచి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

గిద్దలూరు రూరల్:

పట్టణంలోని కొండపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవాన్ని ఈ నెల 11వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీన పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి అగ్గిసేవతో స్వామి వారిని కొండమీదకు ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రికి స్వామి వారి కల్యాణం, 12న గిరిప్రదక్షిణ, గరుడోత్సవం, రాత్రికి విజయవాడ కళాకారులతో భరతనాట్య ప్రదర్శన, 13న భక్తులకు అన్నదానం, రాత్రికి గరుడసేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు.

పత్రికా రంగంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

- మార్కాపురం, గిద్దలూరు, కంభంలో జర్నలిస్టుల నిరసన
- సబ్‌కలెక్టర్‌తోపాటు సీఐ, ఎస్సైలకు వినతిపత్రం అందజేత


మార్కాపురంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు


గిద్దలూరులో ఎస్సైకి వినతి పత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్టులు

మార్కాపురం:

ప్రభుత్వ అవినీతి అక్రమాలు వెలికితీయడంతోపాటు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే పత్రికా రంగంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఏపీయూడబ్ల్యూజే నాయకులు పేర్కొన్నారు. విజయవాడలో సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంలోకి గురువారం విజయవాడ పోలీసులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా ప్రవేశించి దురుసుగా ప్రవర్తించడాన్ని పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. మార్కాపురంలో గురువారం సాయంత్రం పాత్రికేయుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ నుంచి కోర్టు సెంటర్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో పరువు, ప్రతిష్ఠలకు విఘాతం కలిగించే రీతిలో పాలకులు ప్రవర్తించడం శోచనీయమన్నారు. ఎలాంటి కేసులు లేకపోయినా కేవలం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం, సాక్షి మీడియాను అణగదొక్కే కుట్రలో భాగంగా దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రజా వ్యతిరేక చర్యలను ఎవరూ ప్రశ్నించరాదనే నిరంకుశ ధోరణితో కుట్రపూరితంగా ఈ దాడిని చేయించారని విమర్శించారు. ఇది కేవలం సాక్షి ఎడిటర్‌పై జరిగిన దాడి మాత్రమే కాదని, భవిష్యత్తులో మొత్తం మీడియా సంస్థలపై ఇవే దాడులు, ఆంక్షలు, బెదిరింపులు కొనసాగే పరిస్థితి ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాక్షి ప్రతినిధులు జీఎల్ నరసింహారావు, బీఆర్ యోగి, బి.మల్లికార్జున్, జిల్లా, రాష్ట్ర యూనియన్ నాయకులు మూలా అల్లూరెడ్డి, పి.నరేంద్ర, చంద్రశేఖర్, ఎంపీజె రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్‌రజాక్, అమ్ ఆద్మీపార్టీ జిల్లా కన్వీనర్ సుదర్శన్, అంకయ్య, కరీముల్లా, శ్రీనివాసరెడ్డి, అన్వూ, శ్రీకాంత్, సురేష్, ఖలీల్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు తగదు

గిద్దలూరు రూరల్: సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డి నివాసంలోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించడం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లుగా పరిగణిస్తున్నామని గిద్దలూరు ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు నాయబ్‌రసూల్ పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గిద్దలూరు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శివనాగాచారయ్యకు జర్నలిస్టులు వినతి పత్రాన్ని అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేసే జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సరైన పద్ధతి కాదన్నారు. పోలీసుల చర్యలను జర్నలిస్టులంతా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాక్షి ప్రతినిధులు ఎం.రాజ్‌కుమార్, జనార్దన్‌రెడ్డి, టీవీ9 రిపోర్టర్ రసూల్, జర్నలిస్టులు అంకయ్య, నెమలిగుండం, ఖాజా, వేములపాటి శేఖర్, జాఫర్, ఖలీల్, అశోక్, శశి, రమేష్, ఆర్.కె. సాక్షి సిబ్బంది సుదీర్, రవి తదితరులు పాల్గొన్నారు.

కంభంలో సీఐకి వినతి పత్రం

కంభం: సెర్చ్ వారెంట్ లేకుండా సాక్షి పత్రిక ఎడిటర్ నివాసంలోకి పోలీసులు ప్రవేశించడాన్ని నిరసిస్తూ కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు, రాచర్ల జర్నలిస్టులు స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ కె.మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతారెడ్డి, షేక్ ఖాదర్‌బాషా, షంషీర్‌బేగ్, సుబానీ, యేబు, గులాబ్, కట్టా రమేష్, రసూల్, సయ్యద్ సత్తార్, రఫీ, సుబ్బారెడ్డి, రంగస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కంభం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


బడిపాటి సతీష్


వలపర్ల అగస్టీన్

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియెట్ హెచ్ఈసీ విద్యార్థులు ఇద్దరికి ప్రతిభా పురస్కారాలు దక్కాయి. స్థానిక ఎస్సీ హాస్టల్లో ఉంటూ విద్యనభ్యసించిన బడిపాటి సతీష్ 929/1000, వలపర్ల అగస్టీన్ 914/1000 మార్కులతో ప్రతిభ చాటారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ప్రకటించిన ప్రతిభా పురస్కారాలు దక్కాయి. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డీబీవీ స్వామి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతులమీదుగా ప్రశంసా పత్రం, మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐఓ సైమన్ విక్టర్, ఎస్సీ హాస్టల్ అధికారి ఐ.రాంనాయక్, సిబ్బంది అభినందించారు.

పిల్లలను శిక్షణ తరగతులకు పంపించాలి

బేస్తవారిపేట: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి కోరారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. విటమిన్ల ఉపయోగాలు, విటమిన్ల లోపంతో వచ్చే వ్యాధులు, బ్లడ్ గ్రూపులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, పుస్తక పఠనం, బొమ్మలు వేయడం, చెస్, కథలు చదడంపై శిక్షణ ఇచ్చారు.


విద్యార్థులతో కథలు చెప్పిస్తున్న ఉపాధ్యాయుడు

వైభవంగా వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, పోలేరమ్మ తల్లి, పోతురాజు ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా సాగింది. ఆలయాల జీర్ణోద్ధరణ, శిఖర, నవగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను పురస్కరించుకుని వందలాదిగా వచ్చిన భక్తులతో చినమనగుండం గ్రామం పులకించింది. సుప్రభాత సేవ, కలశ తీర్థం, కంకణధారులతో హోమాలు యంత్రాభిషేకం అత్యంత వేడుకగా నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.


నూతనంగా ప్రతిష్ఠించిన బ్రహ్మంగారి మూలవిరాట్

ఇదేం ఎండ బాబోయ్..!


చెట్టు నీడలో సేద తీరుతున్న గేదెలు

భానుడు నిప్పులు చెరగడంతో వేడికి తాళలేక గేదెలు విలవిల్లాడాయి. బీడు భూముల్లో మేత కోసం వెళ్లిన పశువులు ఎండ ధాటికి తట్టుకోలేక ఓ చెట్టు కిందకు గుంపుగా చేరి సేదతీరాయి. బేస్తవారిపేట మండలంలోని జేసీ అగ్రహారంలో ఈ దృశ్యం కనిపించింది.
– బేస్తవారిపేట

కనుల పండువగా చెన్నకేశవుని రథోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చెన్నకేశవుని రథోత్సవం భక్తుల జయజయ ధ్వానాల మధ్య కనుల పండువగా సాగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. రథోత్సవ కార్యక్రమానికి ఉభయదాతలుగా గౌండ్ల కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణ కిరన్, నుదురుపాటి వెంకటకృష్ణారావులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం వసంతోత్సవం, శనివారం ఏకాంత సేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయిని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.


రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

యర్రగొండపాలెం: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ. 2 వేల కోట్లు నిధులు కేటాయించి కరువుతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంతానికి నీటిని విడుదల చేసి ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పూల సుబ్బయ్య భవన్‌లో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మన్నె సాంబశివరావు, సహాయ కార్యదర్శులుగా నక్కా తిరుపతయ్య, వై.వెంకటశివయ్యలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్ట్‌తో పాటు టీ5 కాలువను పుల్లలచెరువు మండలంలోని చిన్నకండలేరు వరకు పొడిగించి అందుకు కావాల్సిన నిధులను ప్రభుత్వం కేటాయించాలని కోరారు. యర్రగొండపాలెం ప్రాంతంలో విస్తారంగా ఉద్యాన పంటలు పండిస్తున్నారని, ఆ ఫలాలను సుదూర ప్రాంతాలకు తీసుకొని వెళ్లి మార్కెటింగ్ చేయడం రైతులకు కష్టంగా ఉందని, వెంటనే జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కోరారు.